ఆధ్యాత్మిక బాటలో కోహ్లీ

రిటైర్మెంట్ తర్వాత సతీసమేతంగా బృందావన్ ఆశ్రమానికి..

ఢిల్లీ: టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన మరుసటి రోజే భారత క్రికెట్ జట్టు మాజీ సారథి విరాట్ కోహ్లీ ఆధ్యాత్మిక బాట పట్టాడు. ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ధామ్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ గోవింద్ ఆశ్రమానికి సతీసమేతంగా వెళ్లాడు. అక్కడ సుమారు మూడు గంటలకు పైగా గడిపిన కోహ్లీ.. ప్రేమానంద్ చెప్పిన విషయాలను ఆసక్తిగా విన్నాడు. రిటైర్మెంట్ ప్రకటన అనంతరం కోహ్లీ పాల్గొన్న తొలి కార్యక్రమం ఇదే కావడంతో ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ ఏడాది జనవరిలోనూ కోహ్లీ రెండు సార్లు బృందావన్ ధామ్‌కు రావడం గమనార్హం.

కోహ్లీకి ఆర్‌సీబీ ఫ్యాన్స్ స్పెషల్ ట్రిబ్యూట్

14 ఏండ్ల టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీకి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అభిమానులు ఘనంగా ట్రిబ్యూట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఐపీఎల్‌లో ఈనెల 17న ఆర్‌సీబీ.. చిన్నస్వామి వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ ఆడనుండగా ఈ మ్యాచ్‌లో బెంగళూరు అభిమానులందరూ కోహ్లీ జెర్సీతో ఉన్న వైట్ డ్రెస్ కోడ్‌లో రానున్నారు. సోషల్ మీడియాలో ఓ అభిమాని ఈ ప్రతిపాదన చేయగా అందుకు ఆర్‌సీబీ ఫ్యాన్స్ అంతా మద్దతు పలికారు.

అద్భుతమైన టెస్టు మ్యాచ్ కెరీర్..ఈ దిగ్గజ క్రికెటర్ సొంతం. టేక్ ఏ బో విరాట్‌కోహ్లీ. ఆట పట్ల నీకున్న అంకితభావం, నీ అసమాన నాయకత్వ శైలిని మిస్సవుతున్నాం. క్రికెటర్‌గా నీవు అందించిన ఎన్నో చిరస్మరణీయ సందర్భాలు, వారసత్వానికి ధన్యవాదాలు. మిగతా ఫార్మాట్లలోనూ అదరగొడుతూ అందరికీ స్ఫూర్తిగా నిలువాలని కోరుకుంటున్నాను.

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

నిశికకు స్వర్ణం

ఖేలో ఇండియా యూత్‌గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గయా(బీహార్) వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిశిక అగర్వాల్ స్వర్ణ పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ ఫైనల్లో నిశిక 44.33 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అద్భుత ప్రదర్శన కనబరుస్తూ నిశిక సత్తాచాటింది. ఇదే విభాగంలో అనౌశ్క పాటిల్ (42.06), సారా రవూల్ (41.23) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

సాయి వర్ధన్‌కు పసిడి

బాలుర యూత్ 89కిలోల కేటగిరీలో బరిలోకి దిగిన తెలంగాణ యువ లిఫ్టర్ సాయి వర్ధన్ పసిడి పతకంతో మెరిశాడు. స్నాచ్‌లో 120 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 155కిలోలతో మొత్తం 275కిలోలు ఎత్తిన సాయివర్ధన్ అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో చెంచు వెంకటేశ్(272కి, ఏపీ), రోహన్‌కుమార్ మహతో(266కి, జార్ఖండ్) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

మంధాన @ 2

దుబాయ్: భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు దూసుకెళ్లింది. ఇటీవల ముగిసిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో రాణించిన మంధాన.. ఒక ర్యాంక్ మెరుగుపరుచుకుని 721 రేటింగ్ పాయింట్లతో సెకండ్ ప్లేస్‌కు ఎగబాకింది. సౌతాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్డ్ట 738 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. 2019లో ఒకసారి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించిన మంధాన.. రాబోయే సిరీస్‌లలో ఇదే జోరు కొనసాగిస్తే మొదటి ర్యాంక్‌కు చేరుకోవడం కష్టమేమీ కాదు.

మురేతో జొకో కటీఫ్

లండన్: కీలకమైన ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్.. కోచ్ ఆండీ మురేతో ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. గతేడాది ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్ అయ్యాక జొకో కోరడంతో ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌కు ముందు అతడితో చేతులు కలిపిన మురే.. ఆరు నెలలు తిరుగకముందే కోచ్ స్థానం నుంచి తప్పుకున్నాడు. తాము కలిసి పనిచేయడం లేదన్న విషయాన్ని ఇద్దరు దిగ్గజాలూ తమ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేశారు. ఈ సీజన్‌లో జొకో ఇంతవరకూ ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. మియామి, మ్యాడ్రిడ్ ఓపెన్ ఫైనల్స్‌లో అతడికి చుక్కెదురైంది.

విదేశీ ఆటగాళ్ల రాకపై అనిశ్చితి

తిరిగొచ్చేదెవరు?

ఒకవేళ వచ్చినా గ్రూప్ స్టేజ్‌కే పరిమితం • ఆసీస్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల ఎదుట డబ్ల్యూటీసీ ఫైనల్ • ప్లేఆఫ్స్ రేసులో ఉన్న జట్లకు తిప్పలు తప్పవా?

ఢిల్లీ: వారం రోజుల వాయిదా అనంతరం మరో మూడు రోజుల్లో మొదలుకాబోయే ఐపీఎల్-18లో విదేశీ ఆటగాళ్ల రాకపై అనిశ్చితి కొనసాగుతున్నది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తాజా సీజన్ మే 25కే ముగియాల్సి ఉండగా తాజాగా దానిని జూన్ 3కు పొడిగించారు. అయితే పలు దేశాల ఆటగాళ్లు తమ దేశం నుంచి మే 25 నాటికే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)ను తెచ్చుకోగా దానిని పునరుద్ధరించే అవకాశం లేదని ఆయా బోర్డులు ఇప్పటికే ఆటగాళ్లకు తేల్చిచెప్పాయి. అదీగాక తమ జాతీయ జట్టు బాధ్యతలూ వారిని సందిగ్ధంలో పడేస్తున్నాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ ఆటగాళ్లలో చాలా మంది ఐపీఎల్‌కు తిరిగి రావడంపై అనాసక్తిగానే ఉన్నారు. ఒకవేళ వచ్చినా గ్రూప్ స్టేజ్ (మే 27) ముగియకముందే టోర్నీకి గుడ్‌బై చెప్పనున్నట్టు తెలుస్తున్నది. ఈ నిర్ణయంతో ప్లేఆఫ్స్ రేసులో ఉన్న టాప్-5 జట్ల (గుజరాత్, బెంగళూరు, పంజాబ్, ముంబై, ఢిల్లీ)కు నష్టం తప్పకపోవచ్చునన్న ఆందోళనలో ఆయా ఫ్రాంచైజీలు ఉన్నాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్ దెబ్బ

వచ్చే నెల 11-15 మధ్య లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరుగబోయే ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌తో ఐపీఎల్ ఫ్రాంచైజీలకు షాక్ తప్పేట్టు లేదు. ఈ ఫైనల్ కోసం మంగళవారమే రెండు దేశాల బోర్డులు జట్లను కూడా ప్రకటించాయి. దక్షిణాఫ్రికా జట్టులో ఉన్న 15 మంది సభ్యులలో ఏకంగా 8 మంది ఐపీఎల్-18 ఆడుతున్నారు. రికెల్టన్, బోష్ (ముంబై), మార్క్‌రమ్ (లక్నో), ఎంగిడి (బెంగళూరు), మల్డర్ (హైదరాబాద్), స్టబ్స్ (ఢిల్లీ), రబాడా (గుజరాత్), యాన్సెన్ (పంజాబ్) ఇది వరకే దక్షిణాఫ్రికాకు వెళ్లారు. వీరికి క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ) ఇచ్చిన ఎన్‌వోసీ మే 25 వరకే. సీఎస్ఏ తాజా ఆదేశాల ప్రకారం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఎంపికైన ఆటగాళ్లంతా మే 31 నాటికి ఇంగ్లండ్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంది. దీని ప్రకారం సఫారీ ఆటగాళ్లు మే 26 లేదా 27న ఐపీఎల్-18ను వీడే అవకాశాలే మెండుగా ఉన్నాయి. ఇక ఆస్ట్రేలియా విషయానికొస్తే కమిన్స్, హెడ్ (సన్‌రైజర్స్), హాజిల్‌వుడ్, డేవిడ్ (బెంగళూరు), స్టార్క్ (ఢిల్లీ), స్టోయినిస్, ఇంగ్లిస్ (పంజాబ్)లో ఎవరొస్తారనేది ఆసక్తికరం. హాజిల్‌వుడ్ గాయంతో భారత్‌కు తిరిగిరావడం అనుమానమే కాగా స్టార్క్ కూడా మళ్లీ తిరుగు ప్రయాణానికి సుముఖంగా లేడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వర్గాలు తెలిపాయి. కమిన్స్, హెడ్ త్వరలోనే హైదరాబాద్‌తో కలిసే అవకాశముంది. హైదరాబాద్ ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన నేపథ్యంలో ఈ ఇద్దరూ గ్రూప్ స్టేజ్ ముగియగానే తిరుగు ప్రయాణమవుతారు.

ఇంగ్లండ్ ప్లేయర్లదీ అదే కథ..

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో పాటు ఇంగ్లండ్ ఆటగాళ్లలో పలువురు గ్రూప్ స్టేజ్‌కు మించి కొనసాగే అవకాశం లేదు. మే 29 నుంచి ఇంగ్లండ్.. స్వదేశంలో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. మంగళవారం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ).. తమ జట్టును ప్రకటించింది. అందులో జోఫ్రా ఆర్చర్ (రాజస్థాన్), జోస్ బట్లర్ (గుజరాత్), విల్ జాక్స్ (ముంబై), జెమీ ఓవర్టన్ (చెన్నై) ఉన్నారు. బెంగళూరుకు ఆడుతున్న బెతెల్ టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్ క్రికెటర్లూ ప్లేఆఫ్స్‌కు అందుబాటులో ఉండరు.

రంగంలోకి బీసీసీఐ..

ప్లేఆఫ్స్ రేసులో లేనప్పటికీ చెన్నై, రాజస్థాన్, హైదరాబాద్ సైతం విదేశీ ఆటగాళ్ల రాకపై సందిగ్ధంతోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ రంగంలోకి దిగి ఆయా దేశాల క్రికెట్ బోర్డులతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఐపీఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో) హేమాంగ్ అమిన్.. సీఏ, ఈసీబీ ప్రతినిధులతో వ్యక్తిగతంగా మాట్లాడుతున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్ల ప్రకటన

మెల్‌బోర్న్: ప్రఖ్యాత లార్డ్స్ (లండన్) వేదికగా వచ్చే నెల 11 నుంచి మొదలుకాబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిల్ పోరు కోసం డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, తొలిసారి ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా.. 15 మందితో కూడిన తమ జట్లను మంగళవారం ప్రకటించాయి. 2023-25 సైకిల్‌లో భాగంగా సౌతాఫ్రికా 12 టెస్టులు ఆడి 8 విజయాలు, 69.44 పాయింట్లు సాధించి అగ్రస్థానంతో ఫైనల్ చేరగా ఆసీస్ 19 మ్యాచ్‌లలో 13 గెలిచి 67.54 పాయింట్లతో రెండో స్థానాన నిలిచింది. పాట్ కమిన్స్ సారథ్యంలోని ఆసీస్, టెంబ బవుమా నాయకత్వంలోని సఫారీలు.. ఐసీసీ గద కోసం తలపడనున్నాయి. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా భారత్‌తో అరంగేట్రం చేసి ఆడిన తొలి మ్యాచ్‌లోనే సంచలన ప్రదర్శన చేసిన సామ్ కొన్‌స్టాస్‌తో పాటు కొద్ది రోజుల క్రితం గాయంతో జట్టుకు దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ ఫైనల్‌కు సెలక్ట్ అయ్యారు. ఇక సఫారీ జట్టులో పేసర్ లుంగి ఎంగిడి తిరిగి జట్టులోకి వచ్చాడు.

ఆస్ట్రేలియా: పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బొలాండ్, అలెక్స్ కేరీ, కామెరూన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, సామ్ కొన్‌స్టాస్, మాట్ కుహ్నెమన్, మార్నస్ లబూషేన్, నాథన్ లియాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, వెబ్‌స్టర్.

దక్షిణాఫ్రికా: టెంబ బవుమా (కెప్టెన్), ఎయిడెన్ మార్క్‌రమ్, డేవిడ్ బెడింగ్‌హామ్, కార్బిన్ బాష్, టోని డి జొర్జి, మార్కో యాన్సెన్, కేశవ్ మహారాజ్, వియాన్ ముల్డర్, ముత్తుసామి, లుంగి ఎంగిడి, డేన్ పీటర్సన్, కగిసో రబాడా, రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరెయ్న.

మెయిన్ డ్రాకు తరుణ్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్‌లో హైదరాబాదీ యువ షట్లర్ తరుణ్ మన్నెపల్లి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. మంగళవారం ఇక్కడ జరిగిన క్వాలిఫయర్స్‌లో తరుణ్ 21-16, 21-19తో భారత్‌కే చెంది న మాజీ ప్రపంచ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్‌ను చిత్తు చేసి మెయిన్ డ్రాలో ప్రవేశించాడు.

పాక్ చీఫ్ కోచ్‌గా మైక్ హెసెన్

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మరో కొత్త కోచ్ వచ్చాడు. గతంలో న్యూజిలాండ్ జాతీయ జట్టుతో పాటు ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు డైరెక్టర్‌గా పని చేసిన మైక్ హెసెన్‌ను పాకిస్థాన్.. తమ హెడ్‌కోచ్‌గా నియమించింది.

రామయ్య పాటకు జేజేలు

మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' నుంచి ఇటీవలే 'రామ రామ..' అంటూ భక్తి భావాలతో కూడిన ఓ గీతాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడీ పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలుస్తున్నది. ఇప్పటికే రెండున్నర కోట్లకుపైగా వ్యూస్ సాధించిన రికార్డు సృష్టించింది. అదే విధంగా అన్ని మ్యూజిక్ ఛార్ట్స్‌లో అగ్ర భాగాన కొనసాగుతున్నది. కోదండరాముడి గుణగణాలను కీర్తిస్తూ సాగిన ఈ పాట ప్రేక్షకులందరినీ అలరిస్తున్నది. చిరంజీవి నృత్యరీతులు, కీరవాణి బాణీ, రామజోగయ్య శాస్త్రి చక్కటి సాహిత్యం ఈ పాటలో ప్రధానాకర్షణలుగా నిలుస్తున్నాయని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశలో ఉంది. దసరా కానుకగా సెప్టెంబర్ చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అభిమానుల కోసం పక్కా ప్రణాళికతో..

ఏడాదికి ఓ సినిమాను అభిమానులకు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు ఎన్టీఆర్. ఆయన నటిస్తున్న బాలీవుడ్ పానిండియా మల్టీస్టారర్ 'వార్ 2' ఈ ఏడాది ఆగస్ట్ 14న విడుదల కానుంది. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 90 శాతం పూర్తయింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ఇందులో తారక్ క్యారెక్టర్ గురించి బీటౌన్‌లో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులో తారక్‌ది నెగెటివ్ షేడ్స్ ఉండే పాత్రని, హృతిక్ పాత్రకు ధీటుగా ఆయన పాత్ర ఉంటుందని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. మరోవైపు ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్‌ను కూడా మొదలుపెట్టేశారు ఎన్టీఆర్. ఇటీవలే మంగుళూరులో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. తారక్ కూడా షూట్‌లో పాల్గొన్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇక తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం 'దేవర - 2'ను కూడా పట్టాలెక్కించే పనిలో ఉన్నారట తారక్. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తి కావొచ్చింది. తొలిపార్ట్‌ని మించేలా అద్భుతమైన స్క్రిప్ట్‌ని దర్శకుడు కొరటాల శివ సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ సినిమా షూటింగ్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి మొదలుపెట్టనున్నారట. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. అనిరుధ్ సంగీత దర్శకుడు. ఈ విధంగా వరుసగా సినిమాలు చేస్తూ మంచి జోష్ మీదున్నారు తారక్.

చిత్రం

లెజెండ్స్ మళ్లీ కలిస్తే..?

దక్షిణాది లెజెండ్స్ రజనీకాంత్, కమల్‌హాసన్ మళ్లీ కలిసి నటిస్తే చూడాలన్నది అభిమానుల ఆకాంక్ష. వీరిద్దరు కెరీర్ ఆరంభంలో 20కిపైగా చిత్రాల్లో నటించారు. వాటిలో మెజారిటీ సినిమాలు సూపర్‌హిట్స్. అయితే ఇద్దరు హీరోలు వ్యక్తిగతంగా స్టార్‌డమ్ సంపాదించుకున్న తర్వాత కలిసి నటించలేదు. 'దళపతి' సినిమాలో కమల్‌హాసన్‌ను తీసుకోవాలనుకున్నారు దర్శకుడు మణిరత్నం. కానీ కుదరలేదు. ఆ స్థానంలో మమ్ముట్టి నటించారు. ఇప్పుడు దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఈ ఇద్దరు సూపర్‌స్టార్స్ కోసం అద్భుతమైన కథను సిద్ధం చేశారట. వయసు మళ్లిన ఇద్దరు గ్యాంగ్‌స్టర్స్ రిటైర్ అయిన తర్వాత ఏం చేశారు? వారి లైఫ్ ఏమిటన్నదే ఈ సినిమా కాన్సెప్ట్ అని తెలిసింది. అయితే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి అన్నీ అనుకూలించాలంటున్నారు. ఎందుకంటే ప్రస్తుతం రజనీకాంత్‌తో 'కూలీ' సినిమా చేస్తున్నారు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ఇది పూర్తయిన తర్వాత 'ఖైదీ' 'విక్రమ్' సినిమాలకు సీక్వెల్స్ చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్ట్స్ అన్నీ పూర్తవడానికి నాలుగేళ్లకు పైగా పట్టొచ్చు. ఆలోగా పరిస్థితులు ఎలాగుంటాయో చెప్పలేం. అయితే తన ఆరాధ్య నటులు రజనీ-కమల్‌హాసన్ కాంబోలో సినిమా చేయాలన్నది లోకేష్ కనకరాజ్ లైఫ్‌టైమ్ డ్రీమ్ అట. దానిని ఎప్పటికైనా నెరవేర్చుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు లోకేష్ కనకరాజ్. అభిమానులు కూడా ఈ ఇద్దరు లెజెండ్స్‌ను వెండితెరపై చూడాలని ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

సమంతతో త్రివిక్రమ్ లేడీ ఓరియెంటెడ్ మూవీ?

త్రివిక్రమ్ దర్శకత్వంలో అత్తారింటికి దారేది, సన్నాఫ్ సత్యమూర్తి, అఆ.. చిత్రాల్లో కథానాయికగా నటించారు సమంత. ఈ మూడూ బ్లాక్‌బస్టర్సే. అయితే.. 'అఆ' తర్వాత త్రివిక్రమ్ డైరెక్షన్‌లో సమంత నటించలేదు. తాజా సమాచారం ప్రకారం మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా రానున్నదని తెలుస్తున్నది. ఇటీవల ఓ సందర్భంలో సమంత తెలుగు సినిమాల్లో నటించాలని త్రివిక్రమ్ కోరారు. సామ్ కూడా తన 'శుభం' ప్రమోషన్‌లో భాగంగా తెలుగు సినిమాల్లో నటించాలనుందనీ, అయితే.. సరైన కథలు రావడం లేదని, మంచి లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ వస్తే చేస్తానని చెప్పుకొచ్చింది. అందుకే.. సామ్ కోసం గురూజీ మళ్లీ కలం పట్టారట. ప్రస్తుతం ఆయన వెంకటేశ్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. వెంకటేష్ కాల్షీట్లు ఖరారైతే.. ఈ సినిమా పట్టాలెక్కుతుంది. అయితే.. ఈ లోపు సామ్ కోసం గురూజీ ఓ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను తయారు చేసే పనిలో ఉన్నారట. 600కోట్ల నిర్మాణ వ్యయంతో అట్లీ తెరకెక్కిస్తున్న బన్నీ ప్రాజెక్ట్ పూర్తవ్వడానికి చాలా సమయం పడుతుంది. ఈ గ్యాప్‌లో.. వెంకీ సినిమాతోపాటు సమంత సినిమాను కూడా పూర్తి చేసేయాలని త్రివిక్రమ్ భావిస్తున్నారని ఫిల్మ్ వర్గాల సమాచారం.

'స్పిరిట్' కోసం 20కోట్లు?

అగ్ర కథానాయికలు సాధారణంగా పదికోట్ల లోపే పారితోషికాన్ని అందుకుంటారు. పాన్ ఇండియా ట్రెండ్ వల్ల ఇటీవలి కాలంలో వారి రెమ్యునరేషన్స్‌లో భారీ పెరుగుదల కనిపిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమా కోసం బాలీవుడ్ అగ్ర నాయిక దీపికా పడుకోన్‌కు 20కోట్ల పారితోషికాన్ని ఆఫర్ చేశారని ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్నది. ఒకవేళ ఇదే గనుక నిజమైతే ఇప్పటివరకు అత్యధిక పారితోషికం అందుకున్న కథానాయికగా దీపికా రికార్డుల్లోకెక్కడం ఖాయమంటున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' తెరకెక్కనుంది. వచ్చే నెలలో సెట్స్‌మీదికి వెళ్లనుందని సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్, అలియాభట్, రష్మిక మందన్నతో పాటు పలువురు అగ్ర నాయికల పేర్లు వినిపించాయి. అయితే ఇప్పటివరకు అధికారికంగా ఎవరినీ ఖరారు చేయలేదు. తాజాగా దీపికా పడుకోన్ పేరు తెరపైకి వచ్చింది. ఆమె ఈ సినిమా కోసం 20కోట్ల భారీ పారితోషికాన్ని డిమాండ్ చేసిందని, మేకర్స్ కూడా అంతమొత్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో ప్రభాస్-దీపికా కలిసి నటించారు. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో అపూర్వ విజయం సాధించింది.

చిత్రపురి కాలనీ ఓ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్

టాలీవుడ్‌కి చెందిన చిత్రపురి కాలనీ నూతన ప్రాజెక్ట్, భవిష్యత్ కార్యాచరణ వివరాలను సంస్థ సభ్యులు ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. త్వరలో ప్రాజెక్ట్‌కి సంబంధించిన భూమి పూజ ఉంటుందని సంస్థ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన బ్రోచర్‌ని విడుదల చేశారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా పరిశ్రమలో కార్మికులందరికీ ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వల్లభనేని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. చిత్రపురి కాలనీ భవిష్యత్‌లో ఓ ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఆయన నమ్మకం వెలిబుచ్చారు.

కుటుంబ ప్రేక్షకుల 3BHK

సిద్ధార్థ్ హీరోగా రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ '3 BHK'. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రధారులు. శ్రీగణేశ్ దర్శకుడు. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్‌విశ్వ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. జూలై 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని బ్యూటిఫుల్ ఫ్యామిలీగా ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పూర్తి కమర్షియల్ సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. మీరా రఘునాథ్, చైత్ర తదితరులు తారాగణం.

త్రిబాణధారి లక్ష్యమేమిటి?

మైథాలజీ టచ్‌తో రూపొందిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఏకకాలంలో మూడు బాణాలు సంధించడంలో నేర్పరి అయిన బార్బరికుడి స్ఫూర్తితో సినిమాకు ఆ టైటిల్ పెట్టారు. సత్యరాజ్, వశిష్ఠ ఎన్ సింహ, సాంచి రాయ్, ఉదయభాను ప్రధాన పాత్రధారులు. మోహన్‌శ్రీవత్స దర్శకుడు. విజయ్‌పాల్ రెడ్డి నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు తుదిదశకు చేరుకున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటించబోతున్నారు. ఓ పురాణపాత్ర నేటి యుగంలోకి ప్రవేశిస్తే ఏం జరిగిందన్నదే ఈ సినిమా కథాంశమని, ఆద్యంతం అనూహ్య మలుపులతో ఆకట్టుకుంటుందని, సత్యరాజ్ నటన హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది.

ప్రతీ తల్లికి వందనం

'ఆపరేషన్ సిందూర్'లో అసువులు బాసిన భారత సైనికుల మీద బాలీవుడ్ నటి అలియాభట్ తన భావోద్వేగాన్ని ఓ పోస్టు ద్వారా పంచుకుంది. ' దేశరక్షణ కోసం నిజమైన హీరోలను కన్న తల్లుల ఆవేదన గుర్తొచ్చి నా హృదయం బరువెక్కింది. ఎందరో తల్లుల త్యాగమే ఈ దేశానికి రక్షణ. ప్రతి వీరసైనికుడి యూనిఫామ్ వెనుక.. నిద్రలేని రాత్రులు గడిపే అతని తల్లి ఉంటుంది. పసి వయసులో తన ఒడిలోనే ప్రశాంతంగా నిద్రించిన తన బిడ్డ.. ఇప్పుడు బార్డర్‌లో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడు. ఉద్రిక్తతలు లేని ప్రశాంతతను మనం ప్రతి రాత్రీ కోరుకుంటాం. కానీ అతనిది ఉద్రిక్తతతో నిండిన ప్రశాంతత. మన రక్షకుల కోసం.. మన దేశం కోసం కలిసి నిలబడదాం.